# మన ప్రజాస్వామ్యాన్ని ధ్వంసము చేస్తున్న బహిరంగ రహస్యాలు

డా॥ వై. వి. మల్లా రెడ్డి *

*తేదీః-08.03.2016*

**1. పరిచయము ః**

***'మానవజాతి నశించి పోవటమంటూ జరిగితే అది అణుబాంబుల వల్లనో, అంటు రోగాల వల్లనో కాదు. నైతిక విలువల పతనం వల్ల మాత్రమే' – ఐన్‌స్టీన్ మహాశయుడు.*** ఈ ప్రవచనం ఈ రోజు మన దేశ పరిస్థితికి అత్యంత సందర్భోచితం.

* * * * *

మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశము. గర్వంగా భావిస్తుంటాము కూడా. సాంఘిక సమానత్వానికి, సామాజిక న్యాయానికి, మత ప్రమేయం లేని పరిపాలనకు, మానవ విలువలకు, స్వతంత్రంగా ఆలోచించడానికి, నచ్చిన వృత్తులు చేపట్టడానికి, భావప్రకటనా స్వాతంత్ర్యానికి, జవాబుదారీతనానికి, పరిపాలనలో పారదర్శకతకు ప్రజాస్వామిక వ్యవస్థలు ప్రాధాన్యతనిస్తాయి.. అందుకే మన రాజ్యాంగ నిర్మాతలు అన్ని "యిజాలు" పరిశీలించి మన దేశం సంపూర్ణ ప్రజాస్వామిక దేశంగా వర్ధిల్లడానికి కావలసిన పునాదులు వేశారు, రాజ్యాంగాన్ని నిర్మించారు. స్వాతంత్ర్యం నాటికి మన సమాజంలో ప్రధానంగా నిరక్షరాస్యత, దారిద్ర్యము, సాంఘిక - ఆర్థిక అసమానతలు, భూస్వామ్య విలువలు, కుల వివక్ష మొదలగు సమస్యలు తాండవిస్తున్న పరిస్థితి. రాజ్యాంగంలో ప్రజాస్వామిక, పురోగామి విధానాల్ని రూపొందించినంతమాత్రాన వెంటనే నిజమైన ప్రజాస్వామిక దేశంగా మారిపోతుందని ఎవరూ అనుకోలేదు. అందుకే రాజ్యాంగ నిర్మాత డా॥ బి. ఆర్. అంబేద్కర్ 1950లో భారత రాజ్యాంగాన్ని ప్రవేశ పెడుతూ తన అభిప్రాయాన్ని ఈ విధంగా వ్యక్త పరిచాడు. 'ప్రతి ఒక్కరికి ఓటు విలువతో రాజకీయ సమానత్వాన్ని సాధించినప్పటికీ, సామాజికంగా, ఆర్థికంగా మనం అనేక వైరుధ్యాలున్న ప్రజాస్వామ్య దశలోకి ప్రయాణం చేస్తున్నాము. సాధ్యమయినంత తొందరలో మనం ఈ అసమానతల్ని రూపుమాపకపోతే, నిరాదరణకు గురవుతున్న వర్గాలు, అణగారిన వర్గాలు ఈ రాజ్యాంగాన్ని బద్దలు కొడతారు'.

అంటే కేవలం రాజ్యాంగంలో ప్రజాస్వామిక మూల సూత్రాలు పొందుపరిచినంత మాత్రాన ఒక్కసారిగా దేశం ప్రజాస్వామికంగా మారిపోదని ఆనాటి మన నాయకులకు బాగా తెలుసు. అయితే ఒక పరిణామక్రమంలో సంపూర్ణమైన ప్రజాస్వామిక దేశంగా క్రమంగా ఎదగాలని ఆనాటి నాయకులు ఆకాంక్షించారు. స్వాతంత్ర్యానికి ముందే ఒక గొప్ప దార్శనికతతో గ్రామ స్వరాజ్యం, అధికార వికేంద్రీకరణ, పరిపాలనలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం లాంటి లోతైన భావనలను మన ప్రజా స్వామ్య ప్రాధమ్యాలుగా మన జాతిపిత మహాత్మాగాంధీ గారు సూత్రీకరించారు. స్వాతంత్ర్యం వచ్చి 68 సంవత్సరాలు పూర్తవుతున్న దశలో మన ప్రజాస్వామ్య పరిణామ గమనాన్ని, పురోగతిని ఒక్కసారిగా వెనక్కు తిరిగి చూసుకుంటే కొన్ని అంశాలలో తీవ్ర ఆశాభంగం కలుగుతుంది. దేశం సంపూర్ణ ప్రజాస్వామిక దేశంగా పరిణతి చెందడమంటే, ప్రభుత్వాలు, వ్యవస్థలు, రాజకీయ పార్టీలలతోపాటు ప్రభుత్వాలలో ప్రజల సామాజిక జీవనంలో, ప్రజాస్వామ్య వ్యవస్థలలో ప్రజాస్వామిక విలువలు ప్రతిఫలించాలి. కానీ దాదాపు 7 దశాబ్దాలు గడిచినా, ఊహించని విధంగా కొన్ని అవాంఛనీయ అప్రజాస్వామిక పరిణామాలు మన ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తూ తిరోగమనం వైపు వేగంగా నెట్టుతున్నాయి. మన ప్రజాస్వామ్య లక్ష్యాలనే తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. అలాంటి తీవ్ర అవాంఛనీయ అప్రజాస్వామిక పరిణామాలేమిటో కొన్నింటిని పరిశీలిద్దాం.

**2. లోతుగా నాటుకొని పోయిన రాజకీయ - పారిశ్రామిక వర్గాల అపవిత్రభంధం ః**

వాణిజ్యం, పరిశ్రమలు పూర్తి పారదర్శకతతో కలుపుగోలుగా అభివృద్ధి (inclusive growth) చెందాలనేది మన ప్రవచిత సిద్ధాంతము. అయితే ప్రజలందరికీ చెందిన వనరులను (సహజ వనరులతో సహా) స్వార్ధ రాజకీయ స్వప్రయోజనాల కోసం, అన్యాయంగా, ఆశ్రిత పక్షపాతంగా ప్రారిశ్రామిక వర్గాలకు మన ప్రభుత్వాలు కట్టబెట్టడం బహిరంగ రహస్యమే. ఈ నేపధ్యంలో మన దేశంలో ఒక బలమైన "ఆశ్రిత పెట్టుబడి దారి వ్యవస్థ" (crony capitalism) ఏర్పడిందనేది కూడా బహిరంగ రహస్యమే. ప్రధాన స్రవంతిలోని రాజకీయ పార్టీలు మరియు పారిశ్రామిక వర్గాల స్వార్థపూరిత అపవిత్ర చీకటి కలయిక కారణంగా కొందరి సంపద విస్ఫోటనంలా పెంచుతూ ప్రజలకు దారిద్ర్యాన్ని పంచుతున్నది. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు పారిశ్రామిక

---

* *డైరెక్టరు, ఎకాలజీ సెంటరు, అనంతపురము.*

వర్గాలు పెద్ద మొత్తంలో నల్లధనం సమకూర్చడం; అందుకు పరిహారంగా అత్యంత విలువైన, అరుదైన సహజ వనరులను, కాంట్రాక్టులను వారికి అప్పగించడం జరుగుచున్నది. ఆ నల్ల ధనాన్ని ఎన్నికల సమయంలో అనధికారంగా ప్రజలను ప్రలోభ పెట్టడానికి పార్టీలు ఉపయోగించడం లేదా నాయకులు కూడబెట్టుకోవడం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. రాజకీయ పార్టీలు బహిరంగ పరచే తెల్లధన జమా ఖర్చులకు, వాస్తవ ఖర్చులకు సంబంధం లేదనేది బహిరంగ రహస్యమే! ఈ దుర్మార్గపు కలయిక మన సమాజంలో అన్ని స్థాయిలలో అవినీతికి, సమాంతర నల్ల ధన వ్యవస్థకు గట్టి పునాదులు వేసి అవినీతిని, చీకటి ఒప్పందాలను, రహస్య సంస్కృతిని పెంచి పోషిస్తున్నది. దీని కారణంగానే అనేక స్కాములలో చీకటి ఒప్పందాలతో వేలకు వేల కోట్ల రూపాయలు రహస్యంగా చేతులు మారడం మనం అందరము వింటున్నదే! ఈ దుష్పరిణామము కేంద్ర స్థాయి నుండి, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, చివరకు గ్రామ పంచాయితీ స్థాయి వరకు ప్రాకింది. ఇందతా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే! ఈ దుష్ట పరిణామము దేశ వ్యాప్తంగా అన్ని రంగాలలో అవినీతికి కారణభూతమై ప్రజాస్వామ్య పునాదులను సమాజంలో నీతి, నిజాయితీలను ధ్వంసం చేస్తున్నది. నల్ల డబ్బు లేకుండా చీకటి ఒప్పందాలు లేకుండా ప్రస్తుత పరిస్థితులలో రాజకీయ పార్టీలు మనుగడ సాగించ లేవు. మన ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బ తీయడానికి తీవ్రమైన ఒక క్యాన్సరు లాగా ఈ పరిణామం పని చేయుచున్నది. ఈ పరిణామమే మన దేశంలో అనేక అప్రజాస్వామిక, అసాంఘిక, అనర్థాలకు అతి ముఖ్య కారణమవుతున్నది. ఈ అపవిత్ర కలయికను చేదించకుండా మన దేశంలో అవినీతిని, నల్లధనాన్ని, ఆశ్రిత పక్షపాతాన్ని, గుప్త సంస్కృతిని ఛేదించలేము. నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించనూ లేము.

### 3. ఎన్నికల ఖర్చులు - బహిరంగ ఉల్లంఘనలు - తప్పడు నివేదికలు :

పార్లమెంటుకు, శాసనసభకు, చివరకు పంచాయితీ సంస్థలకు ఎన్ని కావడానికి కూడా, లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టవలసిన స్థితికి రావడం బహిరంగ రహస్యమే! తత్కారణంగా, అక్రమంగా ఖర్చు పెట్టకల్గిన వారికి మాత్రమే ఎన్నికలలో గెలిచే అవకాశం దొరకుతోంది. ఈ ప్రక్రియలో అవినీతి సొమ్మును ప్రజలకు పంచి, ప్రజలను కూడా అవినీతి చట్రంలోకి దించేస్తున్నారు. అవినీతి పరులకు, ప్రకృతి వనరులను, ప్రభుత్వ వనరులను స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొట్టే వర్గాలకే చాలావరకు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం లభిస్తోంది. లేదా బడా పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు వీరికి పెద్ద మొత్తంలో నల్ల ధనం సమకూర్చి బదులుగా వారికి అక్రమంగా ప్రజావనరుల అప్పగింత, పరిశ్రమల మంజూరు, కాంట్రాక్టల అప్పగింత ద్వారా దేశ సంపదను అప్పనంగా కట్టబెట్టడం జరుగుచున్నది. ఎన్నికల ఖర్చుల మీద అధికారికంగా పరిమితులున్నా, లెక్కకు మించి నిధులు విపరీతంగా ఖర్చుచేయడం బహిరంగ రహస్యమే. తప్పుడు ఖర్చు నివేదికలు సమర్పించడం కూడా బహిరంగ రహస్యమే! ఈ పరిణామం వలన ఎన్నకల సమయంలో పెట్టిన ఖర్చును, ముందుకు రానున్న ఎన్నికలలో పెట్టబోయే ఖర్చును భర్తీ చేసుకోవడానికి, తరతరాలకు దురాశతో కూడ బెట్టుకొనడానికి రాజకీయ నాయకులు అవినీతికి, అశ్రిత పక్షపాతానికి పాల్పడ వలసి వస్తున్నది. ఎన్నికల రాజకీయాలలో డబ్బే ముఖ్యమైనందున, డబ్బు ఖర్చు చేయుటకు ఇష్టం లేని లేదా, డబ్బు లేని నిజాయితీ పరులు రాజకీయాలలేకి రావడానికి ఏ మాత్రం మొగ్గు చూపుట లేదు. ఈ పరిణామంతో రాజకీయాలలో నీతివంతులకు స్థానం లేదనే భావన సమాజంలో నెలకొన్నది. ఒక వేళ ఎవరైన నీతి వంతులు సాహసం చేసి రాజకీయాల లేకి వచ్చినా మనుగడ సాగించలేక పోవడమో లేక అవినీతి పరులుగా మారిపోవడమో జరుగుచున్నది.

### 4. ప్రభుత్వ కార్యాలయాల పనిలో రాజకీయ నాయకుల అనవసర జోక్యం :

మన జాతీయ రాజ్యాంగ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వ విధి విధానాలు కార్యక్రమాలు రూపకల్పన చేయడానికి పాలక వర్గాలకు మన రాజ్యాంగము ఇచ్చిన హక్కు - బాధ్యత. ఆ విధి విధానాలను, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థ వంతంగా అమలు చేయడం వివిధ ప్రభుత్వ శాఖల అధికార కార్యాలయాల బాధ్యత. మన రాజ్యాంగము ప్రకారము ప్రభుత్వ కార్యాలయాల అనుదిన కార్యక్రమాలలో రాజకీయ ప్రతినిధులు జోక్యం చేసుకోరాదు. కానీ ప్రభుత్వ కార్యాలయాల పనిలో పాలక పక్ష రాజకీయ వర్గాల స్వార్థ ప్రయోజనాల కోసం అనవసర జోక్యం, అన్యాయంగా ప్రభావితం చేయడం, తద్వారా సామాన్యులకు న్యాయం జరగడం ఎంత కష్టమో అందరికీ తెలిసిన రహస్యమే! పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వర్తించడం కష్టమైపోతున్నది. ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించే దాదాపు అన్ని పనులలోనూ రాజకీయ నాయకుల జోక్యం వల్ల ప్రభుత్వ కార్యక్రమాల అమలులో గాడితప్పుతున్నాయి. చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, రాజకీయ వర్గాలు కుమ్మక్కై అవినీతి, ఆశ్రితపక్షపాతాలు పెరిగిపోతున్నాయి. ఇందు మూలంగా ప్రభుత్వ కార్యక్రమాల ఫలితాలు రాజకీయ ప్రోద్బలం లేని సామాన్యులకు దక్కడం కష్టమైపోతున్నది. సిఫార్సులు లేక పోతే ప్రభుత్వ కార్యాలయాలలో పనులు జరుగవు అనే భావన దినదినానికి సాధారణ ప్రజలలో బలపడుతున్నది. తగిన సిఫార్సులు ఉంటే అర్హత లేక పోయినా కార్యక్రమాలు పొందవచ్చుననే

భావన కూడా వుంది. ఈ పరిణామంతో ప్రభుత్వ కార్యక్రమాల నుండి లబ్ధి పొందుటకు అర్హులైన సాధారణ ప్రజలు, అనర్హులు కూడా అధికార పార్టీ రాజకీయ నాయకుల చుట్టు తిరిగి, మొదట వారిని సంతృప్తి పరచి, వారి ద్వారా ప్రభుత్వ కార్యాలయాలో పనులు చేయించుకోవలసి వస్తున్నది. ఇందుమూలంగా పైరవీకారులు, దళారీలు, మధ్యవర్తులు తయారై క్రింది స్థాయిలో అవినీతిని పెంచి, ప్రభుత్వ-ప్రజల సంబంధాలను కలుషితం చేస్తున్నాయి. తద్వారా సాధారణ ప్రజలకు ప్రజాస్వామ్యము పైన ప్రభుత్వ కార్యాలయాలపైన నమ్మకము లేకుండాపోతున్నది.

**5. అధికారుల బదిలీలలో రాజకీయ నాయకుల జోక్యం :**

చాలా వరకు సామాన్య ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకూ బదిలీలలో రాజకీయ నాయకుల ప్రమేయం, అవినీతి వుండడం వల్ల న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించాల్సిన అధికారులు, ఉద్యోగులు, రాజకీయ నాయకుల కనుసన్నలలో మెలగాల్సి వస్తోంది. బదలీల కోసం రాజకీయ వర్గాలను సంతృప్తి పరచడం వారికి అవసరమవుతున్నది. దీని ఫలితంగా నీతి, నిజాయితీగల కొంత మంది ఉద్యోగులలో నిరాశ నిస్సహాయతతోపాటు, మరి కొంతమందిలో లంచగొండితనం కూడా పెరిగి పోతున్నాయి. కార్యాలయాల నిర్వహణలో పారదర్శకత అరుదై పోతున్నది. బదలీల కోసం చాలా మంది అధికారులు, ఉద్యోగులు రాజకీయ నాయకుల చుట్టూ తిరగడం, అదే విధంగా రాజకీయ నాయకులు కూడా తమకు అనుకూలురైన అధికారుల కోసం వెతికి బదలీలు చేయించుకోవడం బహిరంగ రహస్యమే. ఈ పరిస్థితి కుల, వర్గ రాజకీయాలను కూడా ప్రోత్సహిస్తున్నది. ముఖ్యంగా ఈ పరిణామం పోలీసు, రెవిన్యూ లాంటి కీలక శాఖలలో బలంగా వున్నదని అందరికీ తెలిసందే! దీని మూలంగా సాధారణ ప్రజలకు అనుదినం సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు రాజకీయ నాయకుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా పని చేయడం పరిపాటి అవుతున్నది.

**6. ప్రజలను పట్టి పీడిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి :**

ఒక ప్రభుత్వ ఉద్యోగి గానీ, ఒక సాధారణ పౌరుడు గానీ నీతి, నిజాయితీగా జీవించడమే ఒక పెద్ద సవాలుగా మారింది. రాజకీయనాయకుల కనుసన్నలలో పని చేస్తున్నంత కాలం ప్రభుత్వ ఉద్యోగుల మనుగడకు ఢోకాలేని పరిస్థితులు ఏర్పడడంతో ప్రజలకు జవాబుదారీతనంగానూ, పారదర్శకంగానూ ఉండాల్సిన ప్రభుత్వ కార్యలయాలు సామాన్య ప్రజల పీడన కేంద్రాలుగా మారిన సందర్భాలే అధికం. కొంత మంది ఉద్యోగస్తులు ఉద్యోగం తెచ్చుకోనడానికి కూడా ఎక్కువ మొత్తంలో వెచ్చించవలసి వస్తున్నది. అందు మూలంగా వారు అవినీతిని పాటించడం, ప్రోత్సహించడం జరుగుచున్నది. కార్యాలయ వ్యవస్థలలో అవినీతి ఒక భాగమైపోయినందున నీతి-నిజాయితీ గల ఉద్యోగులు అవినీతి వ్యవస్థలో ఇమడ లేక సమస్యలను ఎదుర్కొన వలసి వస్తున్నది. లేదా అవినీతిలో భాగం పంచుకోవలసి వస్తున్నది. పట్టాదారు పాసుపుస్తకం కావాలన్నా, పొలానికి కరెంటు కావాలన్నా, పోలీసు కేసు పెట్టాలన్నా, లంచాలు ఇవ్వాల్సిందే అనే భావన సాధారణ ప్రజలలో నెలకొంది. నెలరోజుల్లోనే గతుకులు పడే రోడ్లు, కూలిపోయే బిల్డింగులు, బ్రిడ్జులు, అవినీతి కంపును గురించే చెబుతాయి. ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి ఉన్నదని తెలియని వారెవరైనా ఉన్నారా? అందరు అధికారులు అవినీతిపరులు కారనేది వాస్తవమయినా నీతిగా పారదర్శకంగా ప్రభుత్వ కార్యాలలో పనిజరగడం అరుదుగానే ఉందని అందరికీ తెలిసిన (రహస్య) సత్యం. దీని కారణంగా సాధారణ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపైన, మన ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేకుండాపోతున్నది.

**7. రాజకీయ నాయకులు వారి మనసాక్షిని చంపుకొని నిస్సిగ్గుగా నీతివంతులమని సమర్థించుకోవడం :**

స్వాతంత్రం తరువాత మొదటి దశకాలలో బాధ్యతగల పదవులలో వున్న రాజకీయ నాయకులపై ఏవైనా అవినీతి ఆరోపణలు వచ్చిన వెంటనే పదవుల నుంచి తప్పుకొని నిష్పక్షపాతంగా విచారణకు అవకాశం కల్పించే సంప్రదాయ ముండేది. రాను రాను పరిస్థితి తీవ్రంగా మారిపోయింది. ఇప్పుడు కేవలం ఆరోపణలే కాదు క్రింది కోర్టులలో అవినీతి నిరూపణ జరిగి కటకటాలపాలైనా, ఏమాత్రం సిగ్గు, లజ్జ లేకుండా పదవులలో కొనసాగుటకు రాజకీయ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తారు. శిక్ష అనుభవించి గానీ, నిందితులు బెయిలుపై గానీ, జైలు నుంచి బయటికి వచ్చిన వారికి ఘనకార్యాలు సాధించిన హీరోలుగా ఆర్భాటంగా వీరోచిత స్వాగతం లభిస్తున్నది. చాలా మంది పదవులను అనుభవించిన రాజకీయ నాయకుల చరిత్ర చూస్తే ప్రభుత్వ నిధుల కైంకర్యం, ప్రకృతి వనరుల దురాక్రమణ, కోట్ల ఆస్థుల అక్రమ సంపాదనలు బహిరంగ రహస్యాలే !. తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన వ్యక్తులకు అధికారంలో వున్న కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా బాసటగా నిల్చి వారిని రక్షించడానికి సహాయపడే విపరీత, వికృత సంఘీభావం, సమర్థించే రాజకీయ వ్యవస్థలు, ఇవన్నీ కూడా బహిరంగ రహస్యాలే. అత్యంత అవినీతి పరులు కూడా మనస్సాక్షిని చంపుకొని తామంతా అత్యంత నీతి మంతులమని బహిరంగంగా సమర్థించుకోవడమూ సర్వసాధారణమే. నీతి, నిజాయితీ, మనస్సాక్షి లాంటి భావనలను తుడిచి వేసే ప్రయత్నం జరుగుచున్నది.

**8. ద్వంద నీతి ఒక బహిరంగ రహస్యమే : నీతి - నిజాయితీల గురించి బోధించడం అవినీతిని, అన్యాయాల్ని పాటించడం మన రాజకీయ సంస్కృతి :**

రాజకీయాలలో ఉన్నవారు, ఉన్నత పదవులలో ఉన్నవారు ఉన్నత ధర్మాలతో, న్యాయంగా, స్వచ్ఛంగా, నిష్పక్షపాతంగా, నీతి నిజాయితీలతో ప్రజలకు మార్గదర్శకంగా వుండాలని మన రాజ్యాంగము నిర్దేశిస్తున్నది. దానినే సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు. సామాన్య ప్రజలలో చాలా వరకు న్యాయం, నీతి, నిజాయితీలు, మాటకు నిలబడే లక్షణాలను మనం గమనించగలం. చాలా మంది రాజకీయ నాయకులు, కొంత మంది అధికారులు, పారిశ్రామిక వేత్తలు, కాంట్రాక్టర్లు, ఒక పక్క నీతి, నిజాయితీలను గురించి గంభీరమైన ఉపన్యాసాలిస్తూనే, ఇంకో ప్రక్క ఏ మాత్రం సిగ్గు, లజ్జ లేకుండా అవినీతి అక్రమాలకు పాల్పడడం మనం గమనిస్తూనే వున్నాము. ప్రతిపక్షంలో వున్నప్పుడు ఎదుటి వ్యక్తిలోగానీ, ప్రభుత్వంలో గానీ కనపడిన తప్పు, అధికారంలోకి రాగానే తమ విషయంలో ఒప్పుగా సమర్ధించుకోవడం ప్రస్తుత ప్రతిపక్ష, అధికార వర్గాలలో పెరుగుతున్న వికృత ద్వంద నీతి. చాలా మంది రాజకీయ నాయకులు, అధికారులు, పారిశ్రామిక వేత్తలు, ధనవంతులు అక్రమార్జనతో నల్లధనంలో మునిగి, విలాస వంతమైన జీవనం సాగిస్తున్నారనేది బహిరంగ రహస్యమే! ఇదే వర్గాలు మన ప్రజాస్వామ్య గమ్యాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను, సామాజిక ప్రామాణీకరణను భ్రష్టు పట్టిస్తు తిరోగమనం వైపు నడిపిస్తున్నారు. దౌర్భాగ్యమేమంటే బాహాటంగా అవినీతి, ఆశ్రిత పక్షవాతం లాంటి తప్పులు కనుపడుతున్నా, వీరిని కూడా సమర్ధించే, కీర్తించే కొన్ని వర్గాలు పౌర సమాజంలో పుట్టుకొని రావడం నైతిక విలువల పతనానికి పరకాష్ట. 68 సంవత్సరాలలో నైతిక విలువల విషయంలో మనం ఎంత వెనక్కు పోయినామో బహిరంగ రహస్యమే.

**9. ముగింపు :**

పైన తెల్పిన అప్రజాస్వామ్య, ఆసాంఘిక తిరోగమన పోకడలు జాతీయ స్థాయి నుండి రాష్ట్రాలస్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో, జిల్లా స్థాయిలో, చివరకు గ్రామస్థాయి వరకు అఖండంగా బలంగా వ్యాపిస్తున్నాయి. ఒక గ్రామ పంచాయితీ స్థాయిలో కూడా ఆ స్థాయి రాజకీయ నాయకులు, వ్యాపారుస్థులు, కాంట్రాక్టర్లు, ఉద్యోగ వర్గాలు పైన చెప్పిన అప్రజాస్వామ్య, అవినీతి, తిరోగమన పోకడలనన్నింటినీ పాటిస్తున్నారు. ప్రజాస్వామ్య మంటే కేవలం ఓటు హక్కుకు పరిమితమైన రాజకీయ స్వేచ్ఛ కాదు. ప్రజాస్వామ్యమనేది నీతి, నిజాయితీని పెంచి పోషిస్తూ సమాజాన్ని ఉన్నతమైన సామాజిక, ఆర్ధిక, వ్యక్తిగత, మానవ విలువలవైపు పురోగమించడానికి తోడ్పడాలి. దైనందిక జీవితంలో సమానత్వం, సామాజిక న్యాయం, నీతి, నిజాయితీ, ఆత్మగౌరవం, సమాన అవకాశాలు, పారదర్శకత, జవాబుదారీతనం, అభిప్రాయాలు చెప్పగలిగే స్వేచ్ఛ, తగిన ఏ వృత్తినైనా స్వీకరించ గలిగే స్వేచ్ఛ, ఉన్నప్పుడు, ఇవన్నీ సమాజంలో అంతర్భాగమైనపుడు ఆ సమాజం, దేశం నిజమైన ప్రజాస్వామిక దేశంగా పరిణతి చెందుతుంది. అయితే మన ప్రజాస్వామ్యంలో ప్రజలకు, సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ధనికులు, రాజకీయ పార్టీలు, పాలకులు, పారిశ్రామిక వర్గాలు తిరోగమనం వైపు ప్రజాస్వామిక విలువలను, వ్యవస్థలను తమ స్వార్ధం కోసం దిగజార్చడం బహిరంగ రహస్యం. ఈ బహిరంగ రహస్యాలు ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని, భారత జాతి లక్ష్యాలను, పురోగమనాన్ని అపహాస్యం చేస్తున్నాయి. మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పుకుంటున్నాము. అయితే వున్న ప్రజాస్వామ్య వ్యవస్థను, కూడా అంతే వేగంగా ధ్వంసం చేసుకొంటున్నాము. ఈ పోకడలు ఇట్లే కొనసాగితే మన ప్రజాస్వామ్య పునాదులు పగిలిపోతాయి. చీకటి వ్యవహారాలు, ద్వందనీతి, రాక్షసనీతి రాజ్యమేలే పరిస్థితి ఏర్పడుతుంది.

**ప్రతి ఘటన పౌర సమాజం నుండే రావాలి :**

పౌర సమాజంలో, సాధారణ ప్రజలలో, మీడియాలో ఈ తిరోగమన శక్తులను ప్రతిఘటించాలనే పురోగామి భావనలు బలంగా వున్నాయి. రాజకీయ, అధికార, పారిశ్రామిక, ధనిక వర్గాలలో కూడా ఈ దృష్పరిణామాలను నిరసించేవారు, పురోగమనం కావాలని కోరుకొనేవారు కొందరు ఉన్నారు. అన్ని వర్గాల నుండి, అన్ని స్థాయిలలోనూ ప్రజాస్వామ్య పురోగామి వ్యక్తులు, శక్తులు, వ్యవస్థలు నిరాశావాదంతో అచేతనంగా ప్రేక్షకపాత్రకు పరిమితం కాకుండా స్పందించి, పురోగమనం వైపు చొరవ చూపాలి. పౌర సమాజంలోని పురోగామి వ్యక్తులు, శక్తులు, వ్యవస్థలు చేయి చేయి కలిపి ఏకం కావాలి, ఎదిరించాలి. అప్రజాస్వామ్య పోకడలను, అవినీతి, అన్యాయాలను బలంగా, సంఘటితంగా ప్రతిఘటించాలి. తిరిగి మన ప్రజాస్వామ్య గమనాన్ని పురోగమనం వైపు దారి మళ్లించాలి. మన సమాజంలో నీతిని, నిజాయితీని, మానవ విలువలను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం మనందరి అత్యవసర బాద్యతగా భావించాలి.